# చున్ని

ఇంట్లోంచి హోండా బయటకు తీసి తల్లితో అంది పద్మ, "ఆఫీసు నుండి తిరిగి వచ్చేప్పుడు సుల్తాన్‌బజార్ వెళ్తాను. ఆలస్యం అవుతుంది."

పద్మతల్లి వీధి తలుపులు వేసుకోబోతూ, 'కొత్త చున్నీలు వచ్చాయా?"అడిగింది.

నవ్వి, "పండగ రోజులు కదా, వచ్చి ఉంటాయి." అంది పద్మ.

"ఎన్నో ఉండగా కొత్తవి ఎందుకే కొనడం?"

"మంచివి, వెరయిటీగా ఉన్నవి, ఏమయినా వచ్చాయేమో చూస్తాను. బావుంటేనే కొంటాను" అని బండి స్టార్టు చేసింది.

"నీ ఇష్టం."

ఆమె పద్మ మాటలు కాదనదు. చాలా విషయాల్లో పద్మ అనవసరంగా డబ్బు ఖర్చు చేయదని తెలుసు.

బండి రోడ్డు మీదకు వచ్చింది. పద్మకు అప్పటికే రెండు వందలకు పయిగా చున్నీలు ఉన్నాయి. అవి ఏ డ్రస్సులకన్నా సరిపోతాయి. అంత ఖరీదయినవేమీ కావు. చూసేందుకు బావుంటాయి.

ఇంటినుండి ఆఫీసుకు నలభయి నిమిషాల ప్రయాణం. ట్రాఫిక్‌జాంలో పడితే గంట దాటుతుంది. అప్పుడప్పుడే రోడ్డు రద్దీ అందుకుంటోంది. ఎండాకాలం మొదలు కాకపోయినా గాలి బిగుసుకుపోయి ఉక్కపోస్తోంది.

చున్నీలు కొనడం అలవాటు చేసిన వ్యక్తి అరుణ, సుల్తాన్ బజార్ అనుకుంటే చాలు, అరుణ గుర్తు వస్తుంది. కొట్లలో ఓపికగా మంచి చున్నీలు ఎన్నుకోవడంలో అరుణదిట్ట. బేరం కూడా బాగా ఆడుతుంది.

అరుణ తనకంటే పది సంవత్సరాలు పెద్దది. మనిషి చక్కగానే ఉంటుంది. తనూ ఆమె కలిసి ఆరునెలలపాటు కంప్యూటర్ కోర్సు ఎస్.ఎ.పి, అమీర్‌పేటలో

చేశారు. సంవత్సరం నుండి పరిచయం. స్వతహాగా మంచిమనిసి. నాలుగయిదుసార్లు ఇంటికి వచ్చింది. తన నెప్పుడూ వాళ్లింటికి పిలవలేదు. ఎంచాతో తెలియదు. యం.బి.ఎ.కూడా పూర్తి చేసింది. అరుణ దురదృష్టం ఏమిటోకాని సంబంధాలు దరిదాపుకు వచ్చి వెనక్కి వెళ్ళిపోతుండేయి. ఉద్యోగాలు కూడా కుదురుగా ఎక్కడా చేయలేదు. రెండుమూడుసార్లు కారణం ఏమిటని అడిగితే అరుణ నుండి సరయిన జవాబు రాలేదు. ఏదయినా చెప్పినా ఆమె మాటలు అర్థం అయి, అర్థం కానట్లుగా ఉండేవి. చాలా మటుకు దాస్తున్నట్టుగా అనిపించేది. అరుణ గురించి మరింత తెలుసుకోవాలని పద్మకు అనిపించలేదు.

ఒకసారి మాటల్లో, "నాకు నీలాటి అమ్మానాన్నగాని ఉండుంటే, నా పెళ్ళి ఎప్పుడో అయి ఉండేది" అంది అరుణ. పద్మకు జాలివేసి తల్లికి చెప్పింది. ఆమెకు కూడా జాలివేసి అటు తిరిగి, ఇటు తిరిగి పది సంబంధాల వరకు చూసిపెట్టింది. పెళ్ళిచూపులయ్యాయి. ఏదీ నిశ్చయం కాలేదు.

నెలా పదిహేను రోజులు గడిచాక తల్లి పద్మతో అంది, "అరుణతో స్నేహం తగ్గించుకో."

ఆశ్చర్యపోతూ తల్లి ముఖంలోకి చూసి, "ఏమయిందేం?" అడిగింది పద్మ.

"మనవాళ్ల అమ్మాయి కదా అని ఓపికగా ఇన్ని సంబంధాలు తీసుకువచ్చి నా సమయం వృధా చేసుకున్నాను. ఏదీ ఎందుకు నిశ్చయం కాకపోవడానికి కారణం అరుణే నట. వచ్చిన సంబంధాలను ఏదో వంక పెడుతూ తనే తిప్పికొడుతూ ఉందట. కారణం ఏమిటంటే అరుణకు రఘురాం అనే స్నేహితుడు ఉన్నాడు. అతను అరుణ కన్న ఐదారు సంవత్సరాలు చిన్న. వాళ్ల సంబంధం నాలుగయిదు సంవత్సరాలుగా నడుస్తోంది. గమ్మత్తయిన విషయం ఏమిటంటే అతనికి రెండు సంవత్సరాల కిందటే పెళ్ళయింది. ఒక బాబు అట. ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగకపోతే ఇలాగే జరుగుతుంటాయి."

తల్లి చెప్పిన మాటలకు పద్మకు అరుణ మీద ఎంచాతనో కోపం కలగలేదు. జాలివేసింది. పెళ్ళి అయిన వ్యక్తితో సంబంధం పెట్టుకుందంటే పెళ్ళిమీద ఆసక్తయినా పోయి ఉండాలి. లేదూ ఇంట్లో వాళ్లు తన పెళ్ళి గురించి పట్టించుకోవడం మానేసయినా ఉండాలి.

అరుణ ఎస్.ఎ.పి. థియరీ క్లాసులు పూర్తి చేసింది. కాని ప్రాక్టికల్స్ మీద ఎటువంటి ఆసక్తి చూపించేది కాదు. ఉదయాన్నే క్లాసుకు వచ్చినా క్లాసు

అయిపోయేవరకు ఉండేది కాదు. క్లాసు బయటకు వెళ్ళి లాన్‌లో కూర్చుని చాలాసేపు సెల్‌లో ఎవరితోనో మాట్లాడుతుండేది. ఏదో సందర్భంలో అరుణే పద్మతో అంది, "మా కజిన్ శేఖర్ బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. గంటకు ఒక సారయినా నాతో మాట్లాడకుండా ఉండలేడు."

అరుణ నిజం చెబుతున్నట్టు అనిపించలేదు.

"అంతసేపు మాట్లాడుతోంటే డబ్బులు ఎక్కువ కావా?"అడిగింది పద్మ.

"ఇద్దరి సెల్స్ ఒక కంపెనీవే. సెల్ నుండి సెల్‌కు ఎంతసేపు మాట్లాడుకున్నా ఏం ఖర్చు కాదు."

"మీ ఇద్దరి సెల్స్‌కు ఎకౌంటు నెంబరు ఒకటేనా?"

అరుణ జవాబు చెప్పలేదు. జవాబు చెప్పడం ఇష్టం లేనప్పుడు తల పక్కకు తిప్పుకుంటుంది. దేనిమీదో దృష్టి సారించినట్టు మాట దాటేస్తుంది.

మొదట్లో అరుణ మాటలు పద్మ నమ్మేది. నెమ్మదిగా నిజాలు తెలుస్తోంటే అరుణ మాటలు నమ్మడం మానేసింది. శేఖర్ అసలు పేరు రఘురాం అని, అతను ఉండేది బెంగుళూరులో కాదని బిలాస్‌పూర్‌లో అని, అప్పుడప్పుడు హైదరాబాద్ వస్తుండేవాడని, ఈ మధ్యనే హైదరాబాద్‌కు బదిలీ అయిందని తెలిసిన తర్వాత స్నేహం తెంపుకోలేదు కాని దూరమవ్వటం మొదలెట్టింది. అరుణతో ఫోనులో మాట్లాడడం తగ్గించింది. అసలామెను చూసే నాలుగు నెలలు పయిగా అయింది.

పంజాగుట్ట దాటి మెహదీపట్నం వయిపు దారి మళ్ళించాక అరుణ కనిపించింది. ఎవరి మోటారు బయిక్‌లోనో వెనక కూర్చుని ఉంది. బండి నడుపుతోన్న వ్యక్తి నల్లటి హెల్మట్ పెట్టుకుని ఉన్నాడు. అతను అరుణ అన్నయ్యో, తమ్ముడో అయి ఉండడు. అరుణ అతనికి అతుక్కుని కూర్చుని ఉంది. ఆమె చేతులు అతని నడుం చుట్టూ ఉన్నాయి. వాళ్ల బండి పద్మ బండికి ఆరేడు అడుగుల దూరంలో ఉంది. పద్మ తన బండి వేగం పెంచింది. బండి నడిపే అతన్ని చూద్దామనిపిస్తోంది. హెల్మెట్ ఉండటాన, అతని ముఖం కనబడుతుందో, లేదో తెలియదు. అరుణ తల అతని భుజం మీద వాల్చి తన్మయత్వంతో కళ్ళు మూసుకుని ఉంది.

సిటీలో ఇటువంటి దృశ్యాలు సామాన్యమయినవే. ఎవరూ పట్టించుకోరు. అరుణకు పెళ్ళి అయిందేమోనని పాదాల వంక చూసింది పద్మ. కాలికి బంగారపు రంగు కాలిపట్టాఉంది. కాలి వేలికి మెట్టెలు లేవు. అంటే అరుణకు పెళ్ళికాలేదన్న మాట. బండి నడుపుతోన్న వ్యక్తి ఆమె భర్త కాదు. రఘురాం కావచ్చు. రఫీ

కావచ్చు. జగదీశ్ కావచ్చు. మనోహర్ రాజు కావచ్చు. సురేష్ కావచ్చు. ఆమెకు ఇష్టమయిన ఎవరయినా కావచ్చు. జీవితం ఆమెది. స్వాతంత్ర్యం ఉంది. ఎవరి కంటాపడతాననే భయం లేదు. తనకు ఎటువంటి సంబంధం లేని విషయం.

చటుక్కున పద్మ ఆలోచనలు అక్కడితో ఆగిపోయాయి. అరుణ వేసుకున్న చున్ని సగం గచ్చకాయరంగులో సగం బిస్కెట్ రంగులో ఉంది. ఎక్కడ కొన్నదో ఏమో చాలా బావుంది. ఒక అంచు మెడకు చుట్టుకుని ఉంది. రెండో అంచు రోడ్డుమీద జీరాడుతోంది. అది ఏక్షణంలో అయినా వెనక చక్రానికి చుట్టుకుపోవచ్చు. చుట్టుకుపోతే ప్రాణం పోయే ముప్పు ఉంటుంది.

పద్మకు ఏం చేయాలో తోచడం లేదు. తన బండి వేగం పెంచి, "అరుణా, అరుణా" అరిచింది.

అరుణ తలతిప్పి పద్మను చూసింది. "నీ చున్ని... చున్ని" పద్మ మాటలు అరుణకు వినిపించాయో లేదో, తెలియదు కాని ఎదురుగా వచ్చిన సీటీ బస్సును పద్మ గమనించలేదు.

డ్రయివరు బ్రేక్ వేసేసరికే అంతా అయిపోయింది. పద్మ చున్నీ మటుకు ఎగిరి రోడ్డు పక్కన ఉన్న పూలమొక్కమీద పడింది. దానికి బొట్టంత రక్తం అయినా అంటలేదు.

❖ ఆదివారం వార్త, 15 జూన్, 2008